
దోస్తాన్ చెడిందా..!



2



2

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

## పోలీస్ సంఘం కార్యవర్గానికి ఘనసన్మానం




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రపాటి శ్రీనివాస్ ఇటీవల పోలీసు అధికారులు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్సై యాసిర్ అరాఫత్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా పనిచేస్తున్న శ్రీజ ఎన్నికయ్యారు. వీరిని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అభినందించారు.



**కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపాయి. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్**

## నిరంకుశ పాలను అంతం చేయాల్సిందే..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ దగా, అవినీతి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భారీ ధర్నా నిర్వహించారు. ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోరాటంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టేందుకు జిల్లావ్యాప్తంగా వారం రోజుల కార్యాచరణ బుధవారం ప్రారంభించామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, బైక్ ర్యాలీలు, 420 హామీల ఫ్లెక్సీ ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు.



### ప్రజలను నట్టేట ముంచింది..: మాజీ ఎమ్మెల్యే బిగాల

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తన వెయ్యి రోజుల పాలనలో ప్రజలను నట్టేట ముంచిందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. నగరంలోని ధర్నా చౌక్‌లో వెయ్యిరోజుల్లో కాంగ్రెస్ పాలనలో విఫలమైన పథకాలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. వెయ్యి రోజుల పాలన పూర్తయిందని కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకుంటున్నారని.. వారు ఏం ఉద్ధరించారో స్పష్టం చేయాలని బిగాల పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు విఫలమైనందున 420 ఫీట్ల హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి నిరసన కార్యక్రమాలు తెలుపుతున్నామని బిగాల పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ సిటీ అధ్యక్షుడు సిర్పరాజు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు సత్యప్రకాశ్, సుజిత్ సింగ్ ఠాకూర్, ఢిల్లోడ్ ఆకాశ్, మంజుల యాదవ్, జమాల్‌పూర్ రమేశ్, నీలగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.






### 420 హామీలు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం: వేముల ప్రశాంత్ రెడ్డి

**అక్షరటుడే, బాల్కొండ:** ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, వివిధ డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదని, వెయ్యి అబద్ధాల దగా పాలనగా మారిందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బాల్కొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. 420 హామీల వైఫల్యాలను సూచిస్తూ రూపొందించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో మానవహారం నిర్వహించి ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ నేతలు గతంలో చేసిన ప్రకటనలకు సంబంధించిన వీడియోలను సభలో ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో బాల్కొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బూత్ కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం వివిధ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిల వివరాలతో రూపొందించిన 'కాంగ్రెస్ బాకీ కార్డు'లను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై

# గళమెత్తిన బీఆర్ఎస్

### రాష్ట్రంలో హిట్లర్ పాలన.. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్‌గా మారిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనా వైఫల్యాలను ఎండ గడుతూ బుధవారం ఆర్మూర్ పట్టణంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇది ప్రజాపాలన కాదు పిచ్చి తుగ్లక్ పాలనగా అభివర్ణించారు. అప్పులు, తప్పులు చేయడం తప్ప, కాంగ్రెస్ పాలనలో ఏమున్నది గర్వకారణమన్నారు. దేవుళ్లపై ఒట్లు, ఆరు గ్యారెంటీలకు తూట్లు, కేసీఆర్‌కు తిట్లు వెయ్యి రోజుల కాలంలో రేవంత్ నోరు తెరిస్తే అబద్ధాలు అని ఎద్దేవా చేశారు. అడుగుదీసి అడుగేస్తే మోసాలని అభివర్ణించారు. కాంగ్రెస్‌కు అధికారం తెలంగాణకు మళ్లీ అంధకారం అని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు.



### ఆరు గ్యారంటీల అమలులో విఫలం..: మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

**అక్షరటుడే, బాన్సువాడ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని అన్నారు.



■ ఉమ్మడిజిల్లాలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల నిరసనలు ■ 420 హామీల ఫ్లెక్సీలతో భారీ ప్రదర్శనలు..
■ పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు ■ రాబోయేది కేసీఆర్ పాలన అంటూ నినాదాలు

### కేసీఆర్ కాదు.. రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి : మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



**అక్షరటుడే, కామారెడ్డి:** రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, వెయ్యి రోజులలో హామీలు అమలు చేయని సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో విఫలమయ్యారని నిరసనగా కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించిన 420 హామీలను 420 ఫీట్ల ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు గోవిందా అంటూ పాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో అలవికాని, అమలు చేయలేని 420 దొంగ హామీలతో ప్రజలను మోసం చేసిన విధానం రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగుతోందన్నారు.

### కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు..: మాజీ ఎమ్మెల్యే షకీల్

**అక్షరటుడే,బోధన్:** హామీల ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన సందర్భంగా బోధన్ పట్టణంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వందరోజుల పాలన సందర్భంగా బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఆచరణలో సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని.. వెయ్యి రోజులు గడుస్తున్నా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, సీనియర్ నాయకులు గిరిధర్ గంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.




### రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానిది చీకటి పాలన : దినేష్




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానిది చీకటి పాలన అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి విమర్శించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కో హామీని పక్కన పెడుతూ ప్రజలను మోసం చేస్తోందని దినేష్ విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయినా పట్టించుకోవడం లేదన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే ఇలాంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. వైద్యరంగంలో కూడా ప్రజలకు సరైన భరోసా లేకుండా పోయిందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన సదుపాయాలు, సిబ్బంది, మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. సాగునీటి విషయంలో ఇందూరు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని దినేష్ పటేల్ కులాచారి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతన్ కార్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, బద్దం కిషన్, బొబ్బిలి వేణు గోపాల్, చింత శ్రీనివాస్ రెడ్డి, ఓంసింగ్ నాయక్, పురుషోత్తం, అమంద్ విజయ్ కృష్ణ, నాయిడి రాజన్న, శంకర్ రెడ్డి, ఆనంద్, అన్నం గోపి, పడాల భూపతి, మారెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### 22ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారీగా తహశీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలిటెడ్ లిస్ట్ రూపొందించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, నిర్దిష్ట రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీవో సందీప్, అన్ని మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.




### కుల, ఆదాయ పత్రాల కోసం లబ్ధిదారుల పడిగాపులు



**అక్షరటుడే, లింగంపేట :** మండల కేంద్రంలో కుల, ఆదాయాల ధ్రువపత్రాల జారీకోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. వారం రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. లింగంపేట్ మండలంలో పేరు పలుకుబడి ఉన్న వ్యక్తులకు సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. వారికి ఒక్కరోజులోనే సర్టిఫికెట్ రెడీ చేసి ఇస్తున్నారని.. సాధారణ ప్రజలు వెళ్తేమాత్రం రోజుల తరబడి తిప్పుకుంటున్నారని వారు పేర్కొన్నారు. మీసేవ కేంద్రాల్లో అప్లై చేసి వాటి ద్వారానే తీసుకోవడానికి ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ దరఖాస్తు చేసిన అనంతరం తహశీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలని నిర్వాహకులు పేర్కొంటుండడంతో లబ్ధిదారులు తహశీల్ కార్యాలయాలకు వెళ్తున్నారు. పారదర్శకంగా కుల ఆదాయ ధ్రువపత్రాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మెండోరాలో ఇ–స్కూటీల పంపిణీ



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని మెండోర గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీలను సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీసీ గడాల రఘుపతి మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి, ఆర్థిక వృద్ధి సాధన కోసం పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్త్రీనిధి పథకం ద్వారా కేవలం ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలకే కాకుండా, వ్యక్తిగత అవసరాల కోసం ఎలక్ట్రిక్ స్కూటీలు, ఆటోల కొనుగోలుకు కూడా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన లత, వినోద, నిత్యశ్రీ, లావణ్యలకు ఎలక్ట్రిక్ స్కూటీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు భూమాయి, కార్యదర్శి వినోద, వీవోఏ శిరీష, పుష్పతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



## ప్రతి బుధవారం విద్యార్థులకు చికెన్

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గండిపేట్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులకు దాదాపు 100 మందికి ప్రతి బుధవారం చికెన్‌తో కర్రీ అందజేస్తున్నారు. గండిపేట్ మాజీ సర్పంచ్ అబ్దుల్ ఫారూఖ్ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి బుధవారం రోజు స్కూల్ మొత్తం మధ్యాహ్న భోజనంలో చికెన్ వండుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లోకి సజ్జనపల్లి గ్రామస్థులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** లింగంపేట్ మండలం సజ్జనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. లింగంపేట్ మండలం సజ్జనపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పుట్టి పోచయ్య, వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ, దుర్గయ్య, మంత్రి పోచయ్య, సాయిలు, గోపాల్, రాములు, శ్రీను, బిక్షపతి, శంకర్, రాములు, శ్రీకాంత్, క్రిష్టయ్య, బన్ని, చిన్నప్పగారి గంగారాం, లచయ్యల గంగారాంతో పాటు మరికొంతమందికి ఎల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాజాల సురేందర్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే తాము బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. జాజాల సురేందర్‌తోనే అభివృద్ధి సాధ్యమని, ఆయన నాయకత్వంలోనే నడుస్తామని స్పష్టం చేశారు.



# దోస్తాన్ చెడిందా..!

బల్దియాలో తెరవెనుక సాగిన అంతర్గత దోస్తాన్ ఇప్పుడు బహిరంగంగా బీటలు వారింది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రారంభమైన స్నేహం శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంతో చెడినట్లే కనిపిస్తోంది. ఛైర్‌పర్సన్ పీఠం కోసం బీఆర్ఎస్ సహాయం కోరిన కాంగ్రెస్ ఇప్పుడు యూటర్న్ తీసుకుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఆందోళనలు ఇందుకు ఉదాహరణగా చెప్పుకుంటున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్ల వ్యాఖ్యలు దేనికి సంకేతం..?
- బీఆర్ఎస్ మద్దతుతో ఛైర్‌పర్సన్ పీఠం అధిష్టించిన కాంగ్రెస్
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ ఆరోపణలు
- మిత్రపక్షం నుంచి వైదొలగినట్టేనా..?
- సమాచార లోపమే కారణమా..?

కామారెడ్డి బల్దియా సమావేశం శనివారం నిర్వహించగా కౌన్సిల్‌లో దాదాపు కొట్టుకున్నంత పని చేశారు. మున్సిపల్ అభివృద్ధిపై జరిగే చర్చను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని కాంగ్రెస్ కౌన్సిలర్లు చేసిన ఆరోపణల వెనక ఆంతర్యం ఏమిటన్న చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం రాజీనామా చేస్తామని ప్రకటించడం దుమారం రేపుతోంది.

### కౌన్సిలర్ల వ్యాఖ్యలు దేనికి సంకేతం..?

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఇరు పార్టీల వ్యాఖ్యల దుమారం రేగింది. కాంగ్రెస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ సైతం అంతే స్థాయిలో కౌంటర్ వ్యాఖ్యలు చేయడం చర్చకు దారితీస్తోంది. ఈ వ్యాఖ్యలు కేవలం సాధారణ ఆరోపణలా లేక అధిష్టానం ఆదేశంతోనే తెగతెంపులు చేసుకోవాలనే సంకేతమా అనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

### అభివృద్ధిపై కాంగ్రెస్ ఆరోపణలు

సమావేశంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మున్సిపల్ అభివృద్ధిపై జరిగే చర్చను బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కావాలనే అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. ఇతర వార్డుల సమస్యలపై మీరెందుకు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ కౌన్సిలర్ల నిరసనకు దారి తీసింది.

### బీఆర్ఎస్ మద్దతుతో చైర్మన్ పీఠం

కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 49వార్డులకు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. కాంగ్రెస్ కు 19 స్థానాలు, బీజేపీ 16 స్థానాలు, బీఆర్ఎస్11 స్థానాలు, స్వతంత్రులకు 3 స్థానాలు దక్కాయి. స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో బీజేపీకి అధికారం దక్కకూడదనే ఉద్దేశంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. ఈ అంతర్గత దోస్తాన్‌తోనే కాంగ్రెస్‌కు చెందిన ఇప్ప ఉమారాణి ఛైర్‌పర్సన్ ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ పీఠం బీఆర్ఎస్‌కు వెళ్లింది. కొద్దికాలం పాటు ఈ మిత్రపక్ష పాలన సజావుగానే సాగింది.

### మిత్రపక్షం నుంచి వైదొలగినట్టేనా..?

తాజా ఆందోళనలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య దోస్తాన్ చెడినట్టేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు తమకు సమాచారం ఇవ్వకుండా వార్డుల్లో పర్యటనలు చేస్తున్నారని ఆక్షేపించారు. షబ్బీర్ అలీ, నయీమ్ చెప్పారని పనులు చేస్తున్నప్పుడు తాము ఎందుకని, తమ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించడం దుమారం రేపుతోంది. మిత్రపక్షం నుంచి వైదొలగినట్టేనా అని చర్చించుకుంటున్నారు.

### సమాచారం లోపమే కారణమా..?

మొత్తానికి కామారెడ్డి మున్సిపాలిటీలో వివాదం ముదురుతోంది. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో అధికారులు పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. అయితే వార్డుల పర్యటన సందర్భంగా సంబంధిత వార్డు కౌన్సిలర్‌కు సమాచారం లేకుండానే పర్యటనలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అలాగే జేసీబీతో పనులు చేపడుతున్నప్పుడు బీఆర్ఎస్ కౌన్సిలర్ల వార్డుల్లో మధ్యలోనే ఆపేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వివాదమే బీఆర్ఎస్ ఆగ్రహానికి కారణమవుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీలో జరుగుతున్న వరుస ఘటనలపై ఇరు పార్టీల మధ్య గ్యాప్ వస్తుందన్న ప్రచారం సాగుతోంది. ఇది రెండు పార్టీల మధ్య వివాదమా లేక వ్యక్తుల మధ్య వివాదమా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సెస్సీ, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పొడిగిస్తూ డైరెక్టర్ కె.లింగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ణీత ఫీజుతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించారు. ముందుగా నిర్ణయించిన గడువు ముగిసినప్పటికీ, అనేక మంది విద్యార్థుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చదువు మధ్యలో ఆపేసిన వారు, ఉద్యోగులు, గృహిణులు, డ్రాపౌట్స్ అందరూ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తులు 'తెలంగాణ ఓపెన్ స్కూల్' వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్లో సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని టీవోఎస్ఎస్ స్టడీ సెంటర్ లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## జెడ్పీహెచ్ఎస్ బాల్కొండలో విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు రాజేశ్వర్ పాఠశాలలోని మొత్తం 311 మంది విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఇందులో 158 మంది బాలికలు, 153 మంది బాలురు ఉన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి పాఠశాల సిబ్బంది నిరంతరం కృషి చేస్తారని తెలిపారు.

## విద్యార్థులకు స్కూల్ సామగ్రి అందజేత



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఏకరూప దుస్తులు, షూస్, సాక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కుర్మ మల్లుగొండ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అజీజ్, భారతి, ప్రధానోపాధ్యాయులు కె. వీరప్ప, నక్క ప్రవీణ్, సాయి, కుర్మ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై ఎల్లారెడ్డిలో హియరింగ్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 250 పోలింగ్ కేంద్రానికి సంబంధించి ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ, వివరాల పరిశీలనపై హియరింగ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను మున్సిపల్ కమిషనర్ జీవన్, వార్డు కౌన్సిలర్ సిద్ది శ్రీధర్, బీఎల్‌వోలు పరిశీలించారు. తప్పులు లేదా మార్పులు ఉన్న ఓటర్లకు వాటిని సరిచేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల్లో పేర్లు తప్పుగా నమోదైన వారు, పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాల్లో మార్పులు అవసరమైన వారు సంబంధిత ప్రక్రియ ద్వారా సవరణ చేసుకునే అవకాశం ఉందని, అందుకోసం ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఫేజ్2 బీఎల్ఏలకు శిక్షణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఫేజ్ 2 బూత్ లెవల్ ఏజెంట్ల ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 283 మంది బూత్ లెవల్ ఏజెంట్లకు ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా పరిశీలన, బూత్ స్థాయి బాధ్యతలు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, పీసీసీ నాయకులు యాదయ్య హాజరై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ట్రైనర్ మల్లేష్ యాదవ్ శిక్షణ తరగతులను నిర్వహించారు. బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కార్యకర్తలకు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడంలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొన్నారు.



జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..




ఆలూర్‌లో..



భీమ్‌గల్‌లో ..

## మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి

రైతుల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు చేపట్టి, పేదలకు అండగా నిలిచిన అపర భాగీరథుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వక్తలు కొనియాడారు. ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్ యువశక్తి, ఆరోగ్యశ్రీ వంటి విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



హమల్ వాడి చౌరస్తా లో విక్కి యాదవ్ ఆధ్వర్యంలో..



ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..